కథ

# దోఝక్


## గీతాంజలి

"అరే ఛుప్! ఆనితోని బొంబయి పోయినప్పుడు లేదానే గీ నొప్పి. నోర్మూస్కోని పండుకో. ఒర్లితివంటె సంపుతా... బేషరమ్ ఔరత్" మంగమ్మ గట్టిగ అరుస్తున్నది. మంగమ్మది భారీకాయం. ఒగ యాభై ఏండ్లుంటయ్. కాలు కొంచెం కుంటి. జిజ్జిఖానాల దాయమ్మ. తెల్లచీర యూనిఫారంగ కట్టుకొని అబార్షన్ల వార్డుల పేషంటు జన్నత్‌బేగం మీద ఒర్రుతున్నది.

నొప్పితోని, చలిజ్వరంతోని వణుకుతున్న పదాహారేండ్ల జన్నత్‌బేగం మీద దయలేని దాయమ్మ బేరహంతోని అరుస్తున్నది. అది ఆమెకు మామూలె. "వైసా నక్కో చిల్లావ్. జర్రా అమ్మీకో బులావ్ పావ్ పడ్తుం" కండ్ల నీరు చెంపలపొంటి కారుకుంట మెత్తమీద ఇంకుతుంటె దీనంగ ప్రాధేయపడ్తున్నది జన్నత్‌బేగం.

"బులాతుం... బులాతుమ్... చాయ్‌కే లియే పైసే దియేతో బులాతుమ్ నైతో నై..." మంగమ్మ కఠినంగ అన్నది. "అమ్మీ అమ్మీ అని బలహీనంగ పిల్సుకుంటనే మగతగ కండ్లు మూసుకున్నది జన్నత్‌బేగం. నీరసంతోని బేహోష్ అవుతున్నట్లే అనిపిస్తున్నది. పీడపోయింది అనుకొని మంగమ్మ వార్డులకెల్లి బయటపడింది.

చారో తరఫ్ రేగిస్తాన్. అగ్గితీరు ఎండ. నోరు ఎండిపోతున్నది. దప్పి. మనుషులెవరు కనవడ్త లేరు. ఎవరు తనను ఇక్కడ వదిలిన్రు? అమ్మీ, బావా, భాయీ, బహెన్ ఏరీ? ఈ ఉస్కలకెల్లి ఎవరో తీస్తున్నరు. ఎవడు వీడు... షేక్‌గాడు. తన మీద మీదకు వస్తున్నడు. ఇరగవడుకుంట నగుతున్నడు. వాడి పెయి నిండ పెద్ద పాములున్నయ్... నాగుంబాములు, కట్లపాములు, రక్తపింజెర్లు...బుసకొడ్తున్నయ్. వాడు దగ్గరికి రానే వచ్చిండు. వాడిప్పుడు



షేక్గాదు. పెద్ద కొండ చిలువయ్యిండు. తనను చుట్టుకుంటున్నడు. మింగనీకి నోరు తెరుస్తున్నడు. అరుస్తున్నది. అమ్మీ! అమ్మీ!! అమ్మీ బావా లిద్దరు దూరం నుంచి వస్తున్నరు. గని వాండ్లు గుడంగ పాముల్లెక్క య్యిన్రు. యా ఖుదా! కౌన్ బచేయే గా... షేక్ తనని తీస్కోని ఉస్కలోకి కూరుకపోతున్నడు. ఊపిరాడ్తలేదు. అమ్మీ... అమ్మీ... బావా...ముఝే బచాలో...!

"ఛుప్ క్యో చిల్లాతీహో... సబర్ కర్‌లే కమ్ హో జాయేగీ" సిస్టర్ నాదిరా అంటున్నది. కండ్లు తెర్సింది జన్నత్‌బేగం. కడుపుల నొప్పి. కండ్లు తిరు గుతున్నయ్. పెయిల నుంచి గరమ్ హవా బయటకు తన్నుకొస్తున్నది. సిస్టర్ నాదిరా మొకం సూగ సరింగ కన వడ్త లేదు. ఏమైంది తనకు? ఇంట్ల బేహోష్ అవుడు తెల్సు. అటెన్క తెలివికి వచ్చి జూస్తే ఈ దవాకాన్ల తేలింది. తలుపు అవుతల అమ్మీ బావాలు నిలవడి తనదిక్కే సూస్తున్నరు. అమ్మీ ఏడుస్తున్నది. తనచుట్టూ తెల్లకోట్లు తొడుక్కున్న పిల్లడాక్టర్లు, ఒగ పెద్ద డాక్టరమ్మ ఏందో చెప్తున్నది వాల్లకు.

"హోప్‌లెస్ కేస్ సెప్టీసీమియా. అయినా గని కోషిష్‌చేద్దాం. పాపం చిన్నపిల్ల. సిస్టర్ బ్లడ్ గ్రూప్ చూడండి. బ్లడ్ ఎక్కించాలె. దిసీజ్‌ది కేస్ ఆఫ్ సెప్టిక్ అబార్షన్ అండ్ యుటిరస్ పర్‌ఫోరేషన్. దీనికి కారణాలు ఏమిటంటే ఒకటి ఇల్లీగల్ అబార్షన్స్ డన్ బై అన్ ట్రెయిన్డ్ దాయీస్ ఇన్ విలేజెస్. రెండోది ఇన్‌కంప్లీట్ అబార్షన్స్"డాక్టరమ్మ



మాటలు కొంచెం కొంచెం సమజవుతున్నది జన్నత్‌కు. తన రోగానికే కారణాలు చెబుతున్నది డాక్టరమ్మ. తన ఈ హాలత్‌కి ఎవరు కారణం? తన ఈ హాలత్‌కి కారణం అబార్షన్ చేసిన దాయీ రజియా కాదు... కానేకాదు. మరి ఎవరు? ఆ షేక్గ్గాడు... ఆ నిఖా... ఆ బొంబాయి బత్కు...అమ్మీ బావాలను కమ్ముకున్న దరిద్రం...గీ దరిద్రం మీద షేక్గ్గాడు విసిరిన వల... గివి కారణం డాక్టరమ్మ. మీ పిల్ల డాక్టర్లకు ఇది గుడంగ కారణమని చెప్పురి డాక్టరమ్మ.

నెత్తురు నోట్లెకెల్లి...కండ్లు చెవుల నుంచెల్లి ... బాప్‌రే రెండు కాల్ల నడుమకెల్లి నల్ల ఇప్పినట్లె నెత్తురు పోతున్నది. తన రెండు చేతులు మంచంకు కట్టేసిన్రు. నై నై అన్కుంట అరుస్తున్నది, ఏడుస్తున్నది.

కాళ్ళు దగ్గరికి జరుపుతున్నది. కాళ్ళ దగ్గరున్న ఆయమ్మలను తంతున్నది, గింజుకుంటున్నది. అయినగని కాళ్ళ నడుమనున్న రజియా కోసుగ నున్న సన్నటి కత్రముక్కను తనలోపట్కి గుచ్చి గిరగిర దిప్పుతున్నది... నొప్పి... భరించలేని నొప్పి... అమ్మీ... న...క్కో...ఛోడ్ దో ముఝే. ఎంత అర్సినా రజియా తన లోపట ఏదో చేస్తనే వోయింది...తెలివి దప్పింది తనకు. తెలివి వచ్చేటాల్లకు పిట్ట పిల్లతీరు మంచంమీద బడే అమ్మీ ఇంట్ల ఉన్నది. పాత బస్తీ బార్కాస్ నుంచి తను బడే అమ్మీ ఉంటున్న ఊరు అబ్దుల్లాపూర్ మెట్‌కు వచ్చింది.

అమ్మీ నేను సచ్చిపోతున్న నా చెల్లెండ్లను నా చిట్టి చెల్లెండ్లని మాత్రం షేక్‌లతోని నిఖా చెయ్యకున్రి. నా లెక్క ఖతం అయిపోతరు. అమ్మీజాన్! నేను బత్కుడు కష్టమేనని డాక్టరమ్మ చెపుతున్నది. నా పెయిల నెత్తురంత జహర్ లెక్క మారిందంట. కమస్కం చెల్లెండ్లకు ఇసొంటి హాలత్‌ల వడెయ్యకున్రి. బస్తీలనే గరీబోల్లకు, రిక్షా తొక్కే టోల్లకైనా సరే ఇచ్చి నిఖా చెయ్యున్రి గని పైసలకోసం షేక్‌లకు అంటగట్టకున్రి.

చీకటి మిద్దెల... కాళ్ళనడుమ నెత్తురు... కడుపుల నొప్పి...కాలిపోతున్న జెరం... పెయిల మంటలు తీస్తున్నట్లే ఉన్నది. చలి వెద్తున్నది. చలితోని మూలుగుతున్నది. ఆడిదానికి ఎందుకింత కష్టం? అమ్మీ బావా ఎందుకిట్ల జేసిన్రు? నేనేం పావం జేసిన? అందరు తీర్గ ఔరత్ బచ్చీనై పుట్టిన... పెరి గిన. అమ్మీ నాకు దుబాయ్ వద్దు. షేక్‌గాడు వద్దు. ఈ కడుపూ వద్దు. జిందగీ కావాల. నా బచ్చేదానికి చిల్లు పడిందట. రజియా... ఉల్లె కాన్పులు, అబార్షన్లు జేసే మంత్రసాని కొచ్చటి పుల్లతోని గుచ్చి గుచ్చి గా షేక్‌గాని నిశానీని సంపుడేమో గని ఆ పుల్ల బచ్చే దాని నుంచల్లి ఇంకింత లోపటికి వోయి నా గుండెల్ని గుచ్చింది. అమ్మీ నేను సచ్చిపోతున్న నా చెల్లెండ్లను నా చిట్టి చెల్లెండ్లని మాత్రం షేక్‌లతోని నిఖా చెయ్యకున్రి. నా లెక్క ఖతం అయిపోతరు. అమ్మీజాన్! నేను బత్కుడు కష్టమేనని డాక్టరమ్మ చెపుతున్నది. నా పెయిల నెత్తు రంత జహర్ లెక్క మారిందంట. కమస్కం చెల్లెండ్లకు ఇసొంటి హాలత్‌ల వడెయ్యకున్రి. బస్తీలనే గరీబోల్లకు, రిక్షా తొక్కేటోల్లకైనా సరే ఇచ్చి నిఖా చెయ్యున్రి గని పైసలకోసం షేక్‌లకు అంటగట్టకున్రి. అట్ల కాకపోతే బుర్ఖాలేసి ఇంట్లనే దిగెయ్యున్రి. ఇట్ల షేక్‌గాడు ఎక్కిచ్చిన ఇసం రజియా చేసిన గాయానికైన ఇసం చెల్లెండ్ల పెయిలల్ల ఎక్కియ్యద్దు...వాల్లని సాదుడు కష్టమైతె ఒక్కోల్లకు ఇంత ఇసం ఇచ్చి ఒకసారే సంపెయ్యున్రి...అమ్మీ! ఎందుకు గన్నవే నన్ను? కన్నాంక గిట్ల షేకులకు అంటగట్టుడేంది?...తేరా దిల్ కైసా మానా అమ్మీ! అమ్మీ! దరద్ హోరా...బేహోష్ కర్‌దో...మార్‌దో ముఝే. దమ్ము దియ్యస్తలేదు. ఊపిరి ఆడుతలేదు. అమ్మీ ఈ దోఝుక్‌ల నుంచి అవుతలకు గుంజెయ్యి.

“డాక్టర్... డాక్టర్” నర్సులు అర్సుకుంట హడావుడి పడ్తున్నరు. జన్నత్ బేగం ఆయాసపడుకుంట నొప్పితోని ఎగిరెగిరి పడుతున్నది. డాక్టరు ఉరుక్కుంట వార్డులకచ్చిండు. బీపీ జూసిండు. ఆక్సిజన్ మాస్క్ వెట్టిన్రు. ఏవో సూదులిస్తున్నరు. మూతి విరుస్తున్నరు. ఫాయిదా లేదంటున్నరు. గొంతు తెగిన కోడిపెట్ట తీరు గిలాగిలా కొట్టుకుంటున్నది జన్నత్ బేగం. నడుమ నడుమ గది బయట నిలవడ్డ అమ్మీని చూస్తున్నది. ఆ చూపుల్ల ఎన్ని ప్రశ్నలు! అమ్మీ నాకు ఎందు కు ఈ హాలత్? ఈ దోఝుక్‌ల నన్ను ఎందుకు నూకేసిన్ను? ఎందు కు అమ్మీజాన్? ఎందుకు?

జన్నత్ బేగంను సూసుకుంట కుమిలి కుమిలి కన్నీరు మున్నీరవుతున్నది షెహనాజ్ బేగం. గుడ్లల్ల నీరు కుక్కుకుంట నేరస్థుని తీరు తల వంచుకోని నిలవడ్డడు జన్నత్ తండ్రి తాహెర్ అలీ. వాండ్ల వెనక నల్లమబ్బుల తీరు బురకాలు ఏస్కుని కూసుని ఏడుస్తున్న జన్నత్ బేగం బడీ అమ్మీ, చెల్లెండ్లు నలుగురు.

షెహనాజ్ బేగం అల్లాకు దువా చేస్తున్నది. బిడ్డెని ఎట్లనన్న బత్కియ్యమని...పహాడే షరీఫ్ దర్గాకు వచ్చి ఫాతేహా ఇస్తనని చేతులెత్తి ఆస్మాన్ దిక్కు సూస్కుంట ఏడుస్తున్నది. గా షేక్‌గాడు మోసం జేసిండు. నిఖా జేస్కోని నెల దినాలు ఉంచుకోని బొంబయ్‌ల ఒకింట్ల పనిపిల్ల తీర్గ అమ్మేసి దుబాయ్ దెంక పోయిండు. బిడ్డ వదో కిలాను దాంక సద్వుకున్నది. ఎట్లనో బార్కాస్‌ల తమ పక్కింటి ఫరీదాకు ఫోన్ చేసి తన అతా పతా చెప్పింది. తాము ముంబాయి వోయి బిడ్డె పనిజేస్తున్న ఇంటోల్లని బతిమిలాడి కాల్లమీదవడి షేక్‌గాడికిచ్చిన ఇరవై వెయిలు వాండ్లకిచ్చి వావను దెస్తిమి...అప్పటికే బిడ్డెకు మహినావారి బందయ్యింది. డాక్టర్ని పరీక్ష జేసి రెండు నెలల కడుపని జెప్పింది. ఇగేం జెయ్యాలె రుక్సానా ఆపా కాడికి వోయి ఆడ ఎవలకు దెల్వకుంట మంత్రసాని రజియాతోని కడుపు తీపిచ్చినం...గని కొన్ని దినాలకే మస్తు జెరం, నెత్తురు పోవట్టింది...ఒగరోజు బిడ్డె బేహోష్ అయి పోతె దవాఖానకి కొండవోయినం. డాక్టర్ని టీవీ ఎక్స్‌రే దీపిచ్చింది. అన్ల లోపట బిడ్డసంచికి చిల్లివడ్డదంట. కడుపు పూరాగా సాఫ్‌గాక ఇంకింత మిగిలిపోయి బిడ్డ సంచి పాడయి బిడ్డ పెయంత ఇసం అయిందని. బుద్ధి లేదని తిట్టవట్టింది. మంత్రసాన్లతోని కడుపు దీపి స్తరా? మీ పైసకోసం, ఇజ్జత్‌కోసం బిడ్డె పానం దీస్తరా? అని అర్సుకుంట తిట్టింది డాక్టరమ్మ. ఇగ బిడ్డ బత్కుడు కష్టమంటున్నది. యా అల్లా! నా జన్నత్‌ని బత్కించు. మెరీ బేటీకో బచాలె. ముఝే సజా దో...బచాలే... బచాలె...మేరీ జన్నత్ కో...! ముఝే బిజాదే దోఝుక్ మే.

షెహనాజ్ బేగం కంపించిపోతున్నది. కండ్లనీరు నదులై పారుతున్నది. గులాబి పువ్వసుంటి గుడియా జన్నత్ హాలత్‌ను జూసి తనను తను క్షమించుకోలేకపోతున్నది.

అటు వార్డుల మంచంమీద పడివున్న జన్నత్ లోపలి కదలికలు ఆగి పోయినయ్.

జన్నత్ ఈ దోఝుక్‌ల నుంచెల్లి నిజంగానే జన్నత్‌కెల్లి పొయ్యింది.

